క్లుప్తంగా

రేపు మండల మీట్

గుర్రంకొండ : మండల సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సీతమ్మ ఆధ్వర్యంలో మండల మీట్ నిర్వహిస్తామన్నారు. మండల ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణవేణి బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన ప్రారంభం అవుతుందని తెలిపారు. ఎంపీటీసీలు, అధికారులు హజరుకావాలని కోరారు. అధికారులు అభివృద్ధి నివేదికలు తీసుకురావాలని కోరారు.

ఎస్‌జీ డిగ్రీ కళాశాలలో బ్రిడ్జి కోర్సు

పీలేరు రూరల్ : స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్రిడ్జి కోర్సు ఏర్పాటు చే సినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు బ్రిడ్జి కోర్సులో చేరవచ్చునని తెలిపారు. బ్రిడ్జి కోర్సులో స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేట్ ఇంగ్లీష్, వ్యక్తిత్వ వికాసం, పోటీపరీక్షల విజ్ఞానం వంటి అంశాలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 7 నుంచి ఉదయం 10 గంటల నుంచి మధ్నాహ్నం 1 గంట వరకు తరగతులు ఉంటాయని తెలిపారు. ఈ అవకాశం విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

10న అరుణాచలానికి ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ: గురు పౌర్ణమి పురస్కరించుకుని ఈనెల 10వతేదీన అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ-1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపో నుంచి ఉదయం 9 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. రాను, పోను టిక్కెట్టు రూ.805 చెల్లించాలన్నారు. వివరాలకు 7981753344 , 9440858510 నంబర్లను సంప్రదించాలన్నారు.

ఎట్టకేలకు దాడి ఘటనపై కేసు నమోదు


బాధితుడితో కలిసి ఎఫ్ఐఆర్ చూపుతున్న మాలమహానాడు నేతలు

కలికిరి(వాల్మీకిపురం): వాల్మీకిపురం మండలంలోని చింతపర్తి గ్రామం కోటపల్లికి చెందిన దళిత యువకుడు గురునాథ్‌పై అదే గ్రామం బోయపల్లికి చెందిన భరత్, అతని స్నేహితులు దాడి చేసి గాయపరచిన ఘటన తెలిసిందే. బాధితుడు జూన్ నెల 27న పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. బాధితుడు తన కుటుంబ సభ్యులు, మాలమహానాడు నేతలతో కలిసి మంగళవారం పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలిపాడు. పోలీసులు కేసు నమోదు చేసి న్యాయం చేయకపోతే ఉద్యమిస్తామని మాలమహానాడు నేతలు హెచ్చరించడంతో స్పందించిన పోలీసులు ఎట్టకేలకు భరత్, అతని స్నేహితులపై కేసు నమోదు చేశారు.

ఇన్‌చార్జ్ ఆర్‌ఐగా సదాశివప్ప

గుర్రంకొండ: మండలం ఇన్‌చార్జ్ ఆర్‌ఐగా సదాశివప్ప నాయుడు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. గత కొంతకాలంగా తహసీల్దార్ కార్యాలయంలో మండల ఆర్‌ఐ పోస్టు ఖాళీ ఉంది. గుర్రంకొండ వీఆర్వోగా పనిచేస్తున్న సదాశివప్ప నాయుడుకు ఇన్‌చార్జ్ ఆర్‌ఐగా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ జిల్లా రెవెన్యూ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన ఇన్‌చార్జ్ ఆర్‌ఐ ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఎంఆర్‌పీఎస్ మండల అధ్యక్షుడిగా రామచంద్ర

పెద్దతిప్పసముద్రం: ఎంఆర్‌పీఎస్ మండలాధ్యక్షుడిగా మబ్బు రామచంద్ర, ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా పీ. వెంకట్రమణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా ఇన్‌చార్జి డానియేలు, నియోజకవర్గ అధ్యక్షుడు ప్రతాప్ కుమార్, మాజీ జెడ్పీటీసీ గూటం ఈశ్వరప్పల ఆధ్వర్యంలో బుధవారం నూతన మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడిగా వెంకట్రమణ, గంగాధర్‌లను ఎన్నుకున్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న జిల్లా, మండల కేంద్రాల్లో ఎంఆర్‌పీఎస్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో వెంకటప్ప, చంద్ర,పెద్దోడు, మల్లికార్జున, శ్రీనివాసులు, చరణ్, నరసింహులు, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లిలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వర్ల రమేష్ తెలిపారు. దరఖాస్తులకు చివరి తేదీ జూలై 5వ తేదీ అని తెలియజేశారు.

యథేచ్ఛగా గుట్టలు కబ్జా

పీలేరు మండలంలోని ముడుపులవేముల పంచాయతీ పరిధిలో భూబకాసురులు యథేచ్ఛగా గుట్టలను కబ్జా చేస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. ముడుపులవేముల పంచాయతీ సర్వేనెంబరు 1219, 1220, 1221, 1224 పరిధిలో దాదాపు 30 ఎకరాలు పైగా గుట్టప్రాంతం ఉంది. సమీప గ్రామస్తులు పశువులను మేపుకోవడానికి ఈ ప్రాంతం అనువుగా ఉండేది. అయితే తిరుపతికి చెందిన కొందరు ఆక్రమణదారులు గుట్టను జేసీబీలతో చదును చేసి ఆక్రమించుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి గుట్టను ఆక్రమణ దారుల నుంచి రక్షించాలని కోరుతున్నారు. - పీలేరు


పీలేరులో గుట్టప్రాంతాన్ని చదును చేసిన కబ్జాదారులు

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

ఐటీడీఏ పీఓ మల్లికార్జునరెడ్డి

తంబళ్లపల్లె: గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఐటీడీఏ నెల్లూరు ప్రాజెక్టు ఆఫీసర్ మల్లికార్జునరెడ్డి కోరారు. బుధవారం ఆయన గిరిజన బాలుర రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్య,హాజరు, ఉపాధ్యాయుల పనితీరు తదితర అంశాలపై ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రంగనాయకులను అడిగి తెలుసుకున్నారు. కేవలం 50 మంది విద్యార్థులు మాత్రమే ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. ఇక్కడ రెగ్యులర్ ప్రిన్సిపాల్ లేకపోవడం, ఇంగ్లీషు, సైన్సు సబ్జెక్టులను టీచర్లు లేకపోవడంతో విద్యార్థులు చేరడానికి సుముఖత చేరడం లేదని తెలిపారు. రెగ్యులర్ ప్రిన్సిపాల్, టీచర్లను కేటాయించేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం భోజనం పరిశీలించారు. పాఠశాల ప్రాంగణం, వంటశాల ,టాయిలెట్‌లను పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వ మెనూ పాటించాలన్నారు. విధి నిర్వహణలో ఎవరూ నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఆయన వెంట డిటీడబ్యుఓ తేజస్విని, ఉపాధ్యాయులు ఉన్నారు.


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న పీఓ మల్లికార్జునరెడ్డి

వ్యసనాలకు దూరంగా ఉండండి

బి.కొత్తకోట: విద్యార్థులు వ్యసనాలకు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక సీఐ జీవన్ గంగానాథ్ బాబు కోరారు. బుధవారం స్థానిక సుంకు జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో భవిష్యత్తును తీర్చుదిద్దుకోవాలని సూచించారు. విద్యతో జీవితాల్లో మార్పు వస్తుందని, సమాజంలో ప్రత్యేక గుర్తింపు దక్కుతుందన్నారు. మత్తు పదార్థాల విక్రయాలపై నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎవరైనా మత్తుకు బానిసైతే వారి జీవితాలు నాశనం అవుతాయని, ప్రతి విద్యార్థి అత్యంత జాగ్రత్తతో ఉండాలని కోరారు. ప్రిన్సిపాల్ మంజునాథ్, విద్యార్థినీ, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీఐ గంగానాథ్ బాబు

సబ్జెక్టు టీచర్లు నియమించాలని వినతి

మదనపల్లె సిటీ: మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాలని యూటీఎఫ్ నాయకులు బుధవారం డీవైఈఓ లోకేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. జిల్లా యూటీఎఫ్ గౌరవ అధ్యక్షులు సుధాకర్‌నాయుడు మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలల్లో ఇటీవల బదిలీలు,ప్రమోషన్లు కారణంగా నూతన ఉపాధ్యాయులు వచ్చారని, అయితే సబ్జెక్టు టీచర్లు కొరత తీవ్రంగా ఉందన్నారు. దీని వల్ల రాబోయే పదో తరగతి పరీక్ష ఫలితాలపై ప్రభావం ఉంటుందన్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను నియమించాలన్నారు. మధ్యాహ్న భోజనానికి ఏజెన్సీ ద్వారా పాఠశాల వద్దకు బియ్యం చేర్చాలన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి పురం వెంకటరమణ, గంపల శీనప్ప, విజయకుమార్, సుధాకర్, గాలి రవీంద్ర, చలపతి నాయుడు, మునిరాజ పాల్గొన్నారు.


డీవైఈఓ లోకేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

సైనిక్‌స్కూల్‌కు ఎంపికైన జస్విత్

మదనపల్లె సిటీ: స్థానిక సొసైటీకాలనీలోని మల్లికార్జున కోచింగ్ సెంటర్ విద్యార్థి జస్విత్‌నాయక్ కలికిరి సైనిక్‌స్కూల్‌కు ఎంపికైనట్లు కోచింగ్ సెంటర్ నిర్వహకులు మల్లికార్జున తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో చేరడానికి జరిగిన ప్రవేశపరీక్షల్లో 300 మార్కులకు 252 మార్కులు సాధించాడు. విద్యార్థి తండ్రి గిరిధర్‌నాయక్ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్నాడు. విద్యార్థిని కోచింగ్ సెంటర్ నిర్వాహకులు అభినందించారు.


జస్విత్‌ను అభినందిస్తున్న కోచింగ్ సెంటర్ నిర్వాహకులు

పంటలకు గిట్టుబాటు ధరలు లేవు

కూటమి ప్రభుత్వంలో ఎదుర్కొంటున్న గోడును మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి తెలియజేసిన రైతులు

రామాపురం (రాయచోటి జగదాంబసెంటర్) : రామాపురం మండలం గువ్వలచెరువు గ్రామం హరిజనవాడలో బుధవారం వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి పర్యటించారు. ఆత్మీయ అనురాగాలతో పేరుపేరునా అందరినీ పలుకరించి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి రైతులు, ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ అదును దాటిపోతున్నా సరైన వర్షాలు కురవలేదని శ్రీకాంత్‌రెడ్డి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు కష్టాలు పడుతుంటే కూటమి ప్రభుత్వం రైతు భరోసాను సైతం అందివ్వలేదని, పాల రేట్లు తగ్గాయని, ప్రభుత్వం నుంచి ఏ పథకం అందడం లేదని వారు శ్రీకాంత్‌రెడ్డి ఎదుట వాపోయారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాము అండగా ఉంటామని శ్రీకాంత్‌రెడ్డి భరోసానిచ్చారు. అనంతరం హరిజనవాడకు చెందిన వైఎస్ఆర్‌సీపీ కార్యకర్త శివ అపెండెక్స్ ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటుడటంతో శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు సుబ్బయ్య, ఆయూబ్, ఎంపీటీసీ మాలా, మాజీ సర్పంచ్ ముబారక్, డా.రమణ, కో-ఆప్షన్ జిలాన్, సుబ్బయ్య, సిరాజ్, ఫయాజ్, ఓబులేసు, రాజా, అలీ, యువనాయకులు అయోధ్యపురం పవన్‌కుమార్‌రెడ్డి, బలరాం, శ్రీను, మల్లయ్య, లక్ష్మీనారాయణ, ప్రసాద్, బసయ్య, దొరబాబు, సగినాల శివశంకర్, జోహార్‌ఆలీ, జన, జాబురుల్లీ తదితరులు పాల్గొన్నారు.


గువ్వలచెరువులో పర్యటిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

చెరువు ఆక్రమణపై కలెక్టర్‌కు ఫిర్యాదు

సుండుపల్లె : మండల పరిధిలోని చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీ పూజారివాండ్లపల్లె సమీపంలోని పెద్దచెరువు ఆక్రమణకు గురైందని అదే గ్రామానికి చెందిన పూజారి రామాంజులు, శ్రీనివాసులు బుధవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారులు తెలిపిన వివరాల మేరకు.. పూజారివాండ్లపల్లె సమీపంలో పెద్దచెరువు కింద సుమారు 200 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉందని, ఆ గ్రామంలోని కొందరు వ్యక్తులు చెరువును కబ్జా చేసి బోరు వేసి పంటలు సాగు చేసుకుంటున్నారని చెప్పారు. జిల్లా ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఆక్రమణలను తొలగించి గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్‌ని కోరినట్టు తెలియజేశారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా గఫూర్



రామసముద్రం: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా గఫూర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఆయన డిప్యూటీ ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ అదనపు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎంపీడీఓగా పని చేసిన భానుప్రసాద్ సాధారణ బదిలీల్లో భాగంగా కలకడకు బదిలీ అయ్యారు. మండల అభివృద్ధికి , సంక్షేమ పథకాలు అమలుకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

మదనపల్లె టీడీపీ పోస్టుకు ఒకే వర్గం మధ్య పోటీ

మదనపల్లె: మదనపల్లె నియోజకవర్గ టీడీపీ మండల, పట్టణ కమిటీలకు అధ్యక్షుల ఎంపికకు బుధవారం స్థానిక ఓ కళ్యాణ మండపంలో టీడీపీ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, పరిశీలకుల సమక్షంలో జరిగిన సమావేశంలో మదనపల్లె రూరల్ మండల టీడీపీ అధ్యక్ష పదవికి 14 మంది పోటీ పడ్డారు. మదనపల్లె పట్టణ అధ్యక్ష పదవి కోసం ఒకే సామాజిక వర్గానికి చెందిన నలుగురు పోటీ పడ్డారు. వారిలో టౌన్‌బ్యాంక్ చైర్మన్ విద్యాసాగర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ భవానీ ప్రసాద్, రామ్మూర్తి నాయుడు, సహదేవనాయుడు పోటీ పడగా చివరి క్షణంలో పార్టీ సీనియర్ నాయకుడు కొహెచ్.ప్రశాంత్ పేరు తెరపైకి వచ్చింది. దీనితో ఐదుగురు పోటీలో ఉండగా నిర్ణయం ఎటువైపు ఉంటుందన్నది పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమైంది. పార్టీ నిర్ణయం మేరకు ఎంపిక ఉంటుందని పరిశీలకులు పేర్కొన్నారు. నిమ్మనపల్లె, రామసముద్రం మండలాలనుంచి పార్టీ పదవులు ఆశించే ఆశావాహుల నుంచి పేర్లను ఇంకా తీసుకోలేదు.

నేడు పొంగుబాలు సమర్పణ

సంబేపల్లె : మండల పరిధిలోని మోటకట్ల గ్రామంలోని చిత్తూరు - కర్నూలు జాతీయ రహదారి పక్కన వున్న శ్రీ వెంకటశివసాయి ఆలయ సముదాయంలో కొలువైన శ్రీ రాజేశ్వరమ్మకు నేడు (గురువారం) బోనాల (పొంగుబాలు సమర్పణ) మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణకర్తలు బి.వి సుబ్బారెడ్డి కుటుంబీకులు వెంకటనాథ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, అమరనాథ్‌రెడ్డి, జగన్నాథరెడ్డిలు తెలిపారు. భక్తులు ఉదయం సామగ్రితో ఆలయం వద్దకు రావాలని వారు కోరారు.

ఖరీఫ్ సాగును ఇ-క్రాప్ చేయించండి

సంబేపల్లె : మండల పరిధిలోని శెట్టిపల్లె గ్రామం అడవికమ్మపల్లె బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీపీ శ్రీలత మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్‌లో వరికి సంబంధించిన కె.ఎస్.ఎం. 1638 రకాన్ని సాగు చేయాలన్నారు. అలసంద, నారాయణి రకం వేరుశనగ కాయలు అందుబాటులో వున్నాయన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఇ-క్రాప్ చేయించుకోవాలన్నారు. అనంతరం రైతులకు పంటల సాగుపై సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి కిషోర్‌నాయక్, ఏఓ రమేష్‌రాజు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

పెనగలూరు : మండలంలోని చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. తెలుగు ఉపాధ్యాయురాలు పద్మజ, వ్యాయామ ఉపాధ్యాయురాలు విజయలక్ష్మీలను ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులతోపాటు ప్రధానోపాధ్యాయుడు గోపాలకృష్ణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు ఈ పాఠశాలకు ఎంతో మంచి పేరు తెచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు హరిప్రసాద్, అన్వర్ బాషా, ప్రమీల, ప్రసాద్ రావు, సుదర్శన్, కృష్ణకుమారి, శ్రీవాణిలతోపాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్పకు ఉత్తరా నక్షత్ర పూజలు

రాజంపేట రూరల్ : పట్టణ శివారులోని మణికంఠనగర్‌లోని అయ్యప్పస్వామి దేవస్థానంలో బుధవారం ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, వేదపండితుల ఆధ్వర్యంలో స్వామి మూలవిరాట్‌కు పండ్లు, పాలు, పెరుగు, నెయ్యి, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేశారు.

మామిడి రైతులను ఆదుకోవాలి

–వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్

మదనపల్లె రూరల్ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మామిడి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకటనలకే పరిమితమవుతోందన్నారు. మామిడి గుజ్జు ఫ్యాక్టరీల యజమానులు, వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి రైతులను దోచుకుంటున్నారన్నారు. ధరలు లేక చెట్లలోనే తోతాపురి, నీలం రకాల కాయలను వదిలివేస్తుండటంతో, మాగిన పండ్లు నేల పాలవుతున్నాయన్నారు. ధరలు లేక రైతులు పడుతున్న అవస్థలను ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఆదుకోవాలని కోరారు. గతంలో ఇలాంటి పరిస్థితి మామిడి రైతులకు ఎదురవలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మామిడి మద్దతు ధర కిలోకు రూ.12కు ఉన్నప్పటికీ, రైతులు కిలో కేవలం రూపాయి నుంచి రూ.4కు అమ్ముకునే పరిస్థితి వచ్చిందన్నారు. పంట పెట్టుబడులను కూడా తిరిగి పొందలేని దుస్థితిలో మామిడి రైతులు ఉండటం బాధాకరమన్నారు. మామిడి కోత కూలీల కోసం చేసిన ఖర్చులు కూడా అందకపోవడంతో చెట్లపైనే మామిడిని వదిలేసే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో కేంద్రప్రభుత్వం తోతాపురి మామిడిని రూ.12 మద్దతు ధరకు కొనుగోలు చేసేలా తక్షణం చర్యలు తీసుకోవాలని, కేంద్ర వ్యవసాయ ధరల సంఘం, సీసీఐఏ సమన్వయంతో ప్రత్యేక పథకం తీసుకురావాలని, ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు.


మాట్లాడుతునన నిసార్‌అహ్మద్

మదనపల్లెలో కొలువుదీరిన పీర్లు

మదనపల్లె సిటీ: మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మదనపల్లె పట్టణంలో బుధవారం పీర్లను కొలువుదీర్చారు. స్థానిక నెహ్రూబజార్‌లోని తాటిమాన్ల వద్ద పీర్లను కొలువుదీర్చారు. హిందు, ముస్లిం సోదరులు పీర్లను దర్శించుకుని చక్కర చదివింపులు చేయించారు. సాయంత్రం పీర్ల చావిడి వద్ద భక్తులతో సందడి నెలకొంది. ఈనెల 4వతేదీన చిన్నసరిగెత్తు, 5న విడిదినం, 6వతేదీన పెద్దసరిగెత్తు, 7వతేదీన పీర్లను గ్రామోత్సవం నిర్వహించి సాయంత్రం జలధి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పీర్లచావిడి ముకాన్‌దార్ షాహిదావల్లి తెలిపారు.దీంతోపాటు వన్నూర్‌సాహెబ్‌గుట్టలో పీర్లు కొలువుదీర్చారు.


తాటిమాన్ల వద్ద కొలువుదీరిన పీర్లు

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి

పీలేరు : పీలేరు మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేస్తామని ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి అన్నారు. బుధవారం స్థానిక మార్కెట్ యార్డులో డైరెక్టర్లతో మొదటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి సమావేశంలో వివిధ అభివృద్ధి పనులకు తీర్మాణం చేసినట్లు తెలిపారు. ఇందులో పీలేరు ఏఎంసీకి మంజూరైన రైతు బజారు పనులు త్వరగా చేపట్టి, నిధులు మంజూరు చేయుట, తిరుపతి రోడ్డులోని గూడరేవుపల్లె పంచాయతీ సర్వేనెంబరు 760/6లో రెండు ఎకరముల స్థలంలో కోల్డ్ స్టోరేజ్ నిర్మించుట, కేవీపల్లెలో సర్వే నెంబరు 580లో 6.26 ఎకరాల్లో సబ్‌మార్కెట్ యార్డు నిర్మాణంకు నిధులు మంజూరు, పీలేరు మార్కెట్‌యార్డులో అన్న క్యాంటీన్ నిర్మించుట, యర్రగుంట్లపల్లె పంచాయతీ మార్కెట్ కమిటీ స్థలం అన్యాకాంతం కాకుండా కాపాడుట, మార్కెట్ కమిటీ ప్రధాన భవనం రిపేరుకు ప్రతిపాదనలు సంబంధిత అధికారులకు పంపించేందుకు తీర్మాణం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సురేంద్రరెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి హరినాథ్, డైరెక్టర్లు గొల్ల కిషోర్‌నాయుడు, కలప రవి, రహంతుల్లా, రమాదేవి, లక్ష్మీకాంతమ్మ, సుబ్బయ్య, సాధన, వనిత, అనురాధ, కృష్ణమూర్తి, రజనీశ్రీ, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.


మార్కెట్ కమిటీ సమావేశంలో చైర్మన్ రామ్మూర్తితో డైరెక్టర్లు

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

–ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి

తంబళ్లపల్లె: విద్యార్థులు క్రమశిక్షణతో పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని ఎస్ఐ ఉమా మహేశ్వరరెడ్డి సూచించారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, ఫోక్సో చట్టం, ర్యాగింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. చట్టాలు గురించి తెలుసుకుని చట్టాలను అనుగుణంగా నడుచుకోవాలన్నారు. కాలేజీలో ర్యాగింగ్‌కు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఐ ఉమామహేశ్వరరెడ్డి

జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయండి

రాజంపేట : ఈనెల 5వ తేదీజరిగే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని 3వ అదనపు జిల్లా జడ్జి ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులతో లోక్ అదాలత్ నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్ని రకాలుగా రాజీ కాదల్చిన కేసులను రాజీ చేసి కక్షిదారులకు న్యాయం జరిగే విధంగా సూచనలను వివరించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి టి.కేశవ, జూనియర్ సివిల్ జడ్జి రాజాఉదయప్రకాశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతునాయుడు, బార్ అసోసియేషన్ కార్యవర్గం సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జడ్జి ప్రవీణ్‌కుమార్

మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలి

సిద్దవటం : పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని పెంచాలని కడప రేంజర్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన రాజీవ్ స్మృతివనంలో మాట్లాడుతూ కడప ఫారెస్టు రేంజి పరిధిలోని జేఎంజే కళాశాలకు ఎదురుగా ఉన్న రాజీవ్ స్మృతి వనంలోని నర్సరీలో వేప, నేరేడు, ఉసిరి, ఎర్రచందనం, కానుగ, నెమలినారా, గన్నేరు, గుల్ మహల్ తదితర రకాలకు చెందిన 4 లక్షల మొక్కలను పెంచుతున్నామన్నారు. ఈ నెల 5వ తేదీన విద్యార్థులకు మొక్కలు అందజేసి నాటించే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కడప ఫారెస్టు రేంజి సిబ్బంది పాల్గొన్నారు.


నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉంచిన మొక్కలు

టౌన్ సర్వీసులు నడపాలి

రాయచోటి టౌన్ : అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలో టౌన్ సర్వీస్ బస్సులు నడపాలని రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి విజ్ఞప్తి చేశారు. రాయచోటి జిల్లా కేంద్రం కావడంతో జిల్లా కేంద్ర కార్యాలయాలు వివిధ ప్రాంతాలలో ఉన్నాయన్నారు. రాయచోటి - కడప రోడ్డులో, రాయచోటి రాజంపేట రోడ్డులో, రాయచోటి - చిత్తూరు రోడ్డులో, రాయచోటి - గాలివీడు రోడ్డులో ఇలా వివిధ ప్రాంతాలలో జిల్లా కార్యాలయాలు ఉన్నాయన్నారు. ఆయా కార్యాలయాలకు వెళ్లే సామాన్యులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆటోల ద్వారా వెళ్లాలంటే అధిక చార్జీలు వసూళ్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే టౌన్ సర్వీస్ బస్సులు నడపాలని వినతి చేశారు. ఆర్టీసీ బస్సును టౌన్ సర్వీస్ ద్వారా ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాయచోటి రింగ్ రోడ్డుపైన క్లాక్ వైస్, యాంటీ క్లాక్ వైస్‌తో పాటు రాయచోటి పట్టణంలోని ప్రధాన రోడ్ల వెంబడి టౌన్ సర్వీస్ బస్సులు నడపాలని కోరారు.

పాఠశాల అభివృద్ధిలో ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది

సుండుపల్లె : తిమ్మసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన ప్రధానోపాధ్యాయులు రామచంద్రరాజుకు, ఉపాధ్యాయులు ఉమాశంకర్, రమేష్‌లకు పాఠశాల సిబ్బంది బుధవారం శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా హెచ్ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ బదిలీ అయిన ఉపాధ్యాయులు పాఠశాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారన్నారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ గుండమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.